


# నేటిధాత్రి®
## తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY 2004-2026



ఆదివారం 09-08-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 122 రూ။ 6.00

# చెల్లని రూపాయి రాకేష్ రెడ్డి!?



# పట్టభద్రులకు బీఆర్ఎస్‌లో కొదవ లేదు

ఎక్స్‌క్లూజివ్ నేటిధాత్రి exclusive







# ఎమ్మెల్సీ గెలిస్తేనే "బీఆర్ఎస్" గ్రాఫ్ ఇంకా పెరుగుతుంది


- రాకేష్ రెడ్డి తెలంగాణ ఉద్యమ కారుడు కాదు.
- తెలంగాణ విద్యార్థి ఉద్యమ నాయకుడు కాదు.
- అప్పుడు వినలేదు.. ఓడిపోయారు.
- ఇప్పుడు రాకేష్ రెడ్డికి టికెట్ ఇస్తే అదే జరుగుతుంది.




గతంలో ఎంపిక చేసినప్పుడే నేటిధాత్రి చెప్పింది.

- కమలం లో ఉండి గులాబీ ని తిట్టిన వ్యక్తి రాకేష్ రెడ్డి.
- మూడు జిల్లాల "బీఆర్ఎస్" లో ఏ ఒక్కరికీనచ్చని అభ్యర్థి రాకేష్ రెడ్డి!
- కమలానికి పనికి రాని రాకేష్ రెడ్డి గులాబీ కి పట్టిన శని!

# బీఆర్ఎస్ నాయకులందరికీ అభిప్రాయాలు తీసుకోకుండా తొందరపడి అభ్యర్థిని ఎంపిక చేయకండి



















- రాకేష్ రెడ్డి కి మళ్ళీ టికెట్ ఇస్తే నట్టేట మునిగినట్లే!
- బీజేపీ కాదంటే వచ్చి కారెక్కిన వ్యక్తి రాకేష్ రెడ్డి.
- కాంగ్రెస్ రానివ్వకుంటే గులాబీ పంచన చేరిన వ్యక్తి రాకేష్ రెడ్డి.
- రాకేష్ రెడ్డితో ఊదు కాలిందిలేదు.. పీరు లేచింది లేదు.
- బీఆర్ఎస్ నాయకులందరిపై కారు కూతలుకూసిన వ్యక్తి రాకేష్ రెడ్డి.
- "బీఆర్ఎస్" నాయకులందరినీ తూలనాడిన వ్యక్తి రాకేష్ రెడ్డి.
- ఒకనాడు కేసీఆర్ నే తిట్టిన వ్యక్తి రాకేష్ రెడ్డి!
- ఉమ్మడి వరంగల్ జిల్లా లో పార్టీ నాశనానికి కారణమైన వ్యక్తి.
- పెద్ది సుదర్శన్ రెడ్డి లాంటి ఉద్యమ కారుడిని అవినీతి పరుడని ప్రచారం చేసిన వ్యక్తి.
- హన్మకొండ, వరంగల్ సీట్లు ఓడిపోవడానికి ప్రధాన కారణం రాకేష్ రెడ్డి!
- సోషల్ మీడియా ద్వారా "బీఆర్ఎస్" మీద విష ప్రచారం చేసిన వ్యక్తి.
- కేటీఆర్, హరీష్, సంతోష్, కవిత లను తిట్టిన వ్యక్తి.
- "బీఆర్ఎస్" నాయకులకు గులాబీ చీరలు పంపిస్తానన్నవ్యక్తి.
- అలాంటి వ్యక్తి నాయకుడా.. ఎమ్మెల్సీ కి అర్హుడా!
- వరంగల్ సిటీకి తప్ప నల్లగొండ, ఖమ్మంలలో జనానికి తెలియని వ్యక్తి రాకేష్ రెడ్డి.
- "బీఆర్ఎస్" లో రాకేష్ రెడ్డి తప్ప ఇంకెవరిని నిలబెట్టినా ఎమ్మెల్సీ గెలుస్తుంది!
- నాయకుల మెడ మీద కత్తిపెట్టినా రాకేష్ రెడ్డి గెలవడు.
- "బీఆర్ఎస్" ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే ఇంకెవ్వరిని నిలబెట్టినా గెలుస్తుంది.
- నేల విడిచి సాము చేయొద్దు.. గెలిచే సీటును కోల్పోవద్దు.
- తెలంగాణ పట్టభద్రులు అంత అవివేకులు కాదు.
- సరిగ్గా ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే యూత్ కు రాకేష్ రెడ్డి తెలియదు.
- "బీఆర్ఎస్" పార్టీ అయినా సరే ఎవ్వరిని నిలబెడితే వాళ్లు గెలిచే రోజులు కాదు.
- సరిగ్గా ఎన్నికల ముందు గెలుపు కావాలంటే వివాద రహితులైన ఉద్యమ కారులకివ్వండి!
- రాకేష్ రెడ్డి సోషల్ ఇంజనీరింగ్ లో ఫెయిల్.

హైదరాబాద్, నేటిధాత్రి:

నాపరాయిని సాన పడితే మెరుపు రాదు. నునుపు కాదు. రత్నం కాదు. వజ్రం అసలే కాదు. వచ్చేఏడాది జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరిని పడితే వారిని బిఆర్ఎస్ నిలబెడితే గెలుపు సులువు కాదు. ఈ మాటలు అంటున్నది ఎవరో కాదు. సాక్ష్యాత్తు మూడు ఉమ్మడి జిల్లాలు, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాకు చెందిన బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే అభిప్రాయపడుతున్నారు. బిఆర్ఎస్‌పార్టీ అంటే ప్రజలకు ఒక నమ్మకం. ఒక విశ్వాసం గుండెల్లో నిండి వున్న పార్టీ. సాధారణంగా అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని సార్లు అభ్యర్థుల ఎంపికలో అధినేత కేసిఆర్ తీసుకునే నిర్ణయాలను ప్రజలు కూడా అంగీకరించిన సందర్భాలున్నాయి. ప్రజలే బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకున్నారు. ఇప్పుడైనా, అప్పుడైనా, ఎప్పుడైనా ప్రజలు బిఆర్ఎస్‌కు అనుకూలంగానే వున్నారు. మాజీ సిఎం. కేసిఆర్ అంటే ప్రజల గుండెల్లో బలమైన నాయకుడుగా వున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం అభ్యర్థుల ఎంపిక తొందర పాటు నిర్ణయం వద్దని పార్టీ నాయకులే కాదు, ప్రజలు కూడాకోరుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎన్నికకోసం అభ్యర్థి ఎంపికపై ఆచి తూచి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. వడపోత ద్వారా పార్టీనాయకులు, కార్యకర్తలు, యూనివర్సిటీ విద్యార్థి విభాగం నాయకుల అభిప్రాయం తీసుకొని ఎంపిక చేయాలని సూచిస్తున్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటమి పాలైన రాకేష్‌రెడ్డికే మరో సారి అవకాశమిస్తారనే ప్రచారం జరుగున్న నేపథ్యంలో నాయకులంతా ఉత్సాహంగా లేరు. పడికెడు మంది సమ్మతించినా, పుట్టెడు మంది మాత్రం వ్యతిరేకంగా వున్నారన్న సంగతి పార్టీ గుర్తించాలని కోరుతున్నారు. రాకేష్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వడంలో తప్పు లేదు. కాని అభ్యర్థి ఎంపికపైనే అనేక అభ్యంతరాలున్నాయి. గత ఎన్నికల్లోనే రాకేష్‌రెడ్డికి అవకాశం కల్పించడమే నాయకులకు సుతారం ఇష్టం లేదు. ఇప్పుడు మరోసారి రాకేష్‌రెడ్డికి అవకాశమిస్తారనే ప్రచారం జరుతుంటే అయిష్టంగానే కనిపిస్తున్నారు. రాకేష్‌రెడ్డి స్థానంలో గతంలోనే బిఆర్ఎస్‌కు చెందిన ఉద్యమకారుల్లో ఎవరికి ఇచ్చినా ఫలితం మరో రకంగా వుండేది. ఒక వేళ అప్పుడు ఓడిపోయినా, అదే అభ్యర్థికి టిక్కెట్ ఇచ్చినా ఎవరూ అభ్యంతరం చెప్పకపోయేవారు. ఈసారి మరింత కసిగా పనిచేసేవారు. నాయకుల మెడమీద కత్తిపెట్టినట్లు మళ్లీ రాకేష్‌రెడ్డికే టికెట్ ఇస్తేమాత్రం మొదటికే మోసం వస్తుందని అభిప్రాయపడుతున్నారు. రాకేష్‌రెడ్డి బిజేపిలోవున్నప్పుడు కేసిఆర్‌తోసహా, కేటిఆర్,హరీష్‌రావు, సంతోష్‌రావు, ఆ సమయంలో కవితలపై కారు కూతలు కూసిన సందర్భాన్ని పార్టీ నాయకులు మర్చిపోవడం లేదు. అంతే కాకుండా అప్పుడు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అప్పటి ఎమ్మెల్యేలు, ఇతర నాయకులను రాకేష్‌రెడ్డి తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు. ఇటీవల ఆకాల మరణం చెందిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిపై అనేక అవినీతి ఆరోపణలు చేశాడు. పెద్ది సుదర్శన్‌రెడ్డి వందల కోట్ల అవినీతికి పాల్పడినట్లు రాకేష్‌రెడ్డి విమర్శలు చేశారు. రాకేష్‌రెడ్డి ఉన్నతవిద్యావంతుడు అనే ఒకే ఒక్క కారణంతో పార్టీలో చేర్చుకున్నారు. రాకేష్‌రెడ్డి రాజకీయం ఎలాంటిదో తెలిసిన తర్వాతే బిజేపి టికెట్ ఇవ్వలేదు. కాంగ్రెస్ దగ్గరుకు రానివ్వలేదు. ఆపై కారును ఎంచుకున్నారు. ఏ కారు పార్టీ మీద కారు కూతలు కూశాడో అదే పార్టీలో చేరితే ఇక్కడ కూడా వాషింగ్ పౌడర్ నిర్మా అయ్యిందా? అనే ప్రశ్నలు ఆనాడే వినిపించాయి. ఈ సంగతి బిఆర్ఎస్ అధినేత, కేసిఆర్‌దాకా చేరకపోవచ్చు. ఆనాడు పార్టీ నాయకులు కేసిఆర్‌కుభయపడి చెప్పకపోవచ్చు. ఇప్పుడు కూడా వ్యతిరేకించకపోవచ్చు. కాని లోలోన మధనపడుతూ పనిచేయడం అనేది సాధ్యం కాదు. గుర్రాన్ని నీళ్ల వరకు తీసుకెళ్లొచ్చేమో కాని, నీళ్లు తాగించలేమన్న సామెత తెలియందికాదు. బిజేపిలోవున్న సమయంలో రాకేష్‌రెడ్డి తన సోషల్ మీడియా ద్వారా తన సొంతప్రచారం చేస్తే ఆ సమయంలో మీడియా హైలెట్ చేసింది. కాని జనం మాత్రం స్వాగతించలేదు. అందుకే బిఆర్ఎస్ సిట్టింగ్ సీటు అయిన నల్లగొండ పట్టభద్రుల స్థానం తీన్మార్ మల్లన్న చేతిలోకి వెళ్లిపోయింది. అప్పటిదాకా బిఆర్ఎస్‌ను తూర్పారపట్టిన రాకేశ్‌రెడ్డికి వెంటనే టికెట్ ఇస్తే ప్రజలు ఆమెదిస్తారు. గెలిపిస్తారని ఎలా అనుకున్నారో అర్థం కావడం లేదు. ఆ సమయంలో నిరుద్యోగ గర్జనలు సాగుతున్నాయి. ఆనాడు సిఎం.కేసిఆర్‌తోసహా అందరినీ రాకేష్‌రెడ్డి తిట్టిన తీరు నాయకులు మర్చిపోలేదు. ఆనాడు పోలీసులకు కూడా గులాబీ చీరలు పంపిస్తామని రాకేశ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపాయి. అయినా సరే రాకేష్‌రెడ్డికే రెండోసారి ఇవ్వాలనుకున్నప్పుడు ఈ రెండున్నరేళ్లకాలంలో రాకేష్‌రెడ్డి యువతతో చేపట్టిన ఉద్యమాలెన్ని? పోరాటాలెన్ని? కేసులు ఎదుర్కొని జైలుకు వెళ్లిన సందర్భాలెన్ని? అనేది కూడా జనం చూడకుండా వుంటారా? బిఆర్ఎస్ అదికారంలో వున్నప్పుడు బల్మూర్ వెంకట్ లాంటి వాళ్లు చేసిన పోరాటాలు బిఆర్ఎస్ నాయకులకు గుర్తుంటే రాకేష్‌రెడ్డికి ఈసారి టికెట్ ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వాలని అనుకోరు. మీడియా ముందుకు వచ్చిన నాలుగు ముచ్చట్లు మాట్లాడితే వ్యూస్ వస్తాయేమోగాని, ఓట్లు పడవు అనేది ఇప్పటికైనా తెలుసుకోవాలి. సోషల్ మీడియా ద్వారా పాపులర్ కావాలనుకుంటే జనంలో వుండి పోరాటం చేసి హైలెట్ కావాలి. ఇప్పటికీ రాకేష్‌రెడ్డి తన వల్లనే గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు రెండోస్థానం విచ్చిందని తన అనుచరుల వద్ద చెబుతుంటాడని సమచారం. బిఆర్ఎస్ పార్టీ టికెట్ ఇవ్వడం వల్ల వచ్చిన ఓట్లు అనే ఆలోచనలో రాకేశ్‌రెడ్డి లేరన్న విషయం పార్టీ ఇప్పటికైనా తెలుసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు కోరుతున్నారు. అయినా ఉమ్మడి వరంగల్ జిల్లాలోవున్న పార్టీ నాయకార్యకర్తలకే సరిగ్గా తెలియని రాకేష్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లా నాయకుకు, కార్యకర్తలకు పూర్తిగా తెలియదనేది ముమ్మాటికీ వాస్తవం అని పార్టీ శ్రేణులుచెబుతున్నారు. తెలంగాణలో ఇప్పుడు బిఆర్ఎస్ ఎంతో బలంగా వుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలు కేసిఆర్ మళ్లీ ఎప్పుడు వస్తాడా? అనిఎదురుచూస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తాయా? కేసిఆర్‌ను ఎప్పుడు గెలిపించుకుంటామా? అనే ఆలోచనతో రైతులున్నారు. కాని యువత ఇంకా బిఆర్ఎస్ వైపు పూర్తిగా చూడడం లేదు. నిరుద్యోగులు గాలి వాటం ఓట్లు? ఖచ్చితంగా బిఆర్ఎస్‌కే వేస్తారన్న నమ్మకం లేదు. పార్టీని చూసి, కేసిఆర్‌కోసమైనా ఓట్లు వేయాలనుకునేవారు అభ్యర్థిని కూడా ఒక్క శాతమైనా చూడకుండా వుంటారా? మూడు ఉమ్మడి జిల్లాలకు చెందిన, 27 అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన నిరుద్యోగులు, పట్టభద్రులు, ఉద్యోగులు ఓట్లు వేయాలి. అంతో ఇంతో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలున్నప్పుడే గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డి గెలవలేదు. వచ్చే ఎన్నికల్లో ఎలాగూ బిఆర్ఎస్‌పార్టీ 80కిపైగా సీట్లు గెల్చుకునే వాతావరణం కనిపిస్తోంది. పార్టీ అదికారంలోకి వచ్చిన తర్వాత రాకేష్‌రెడ్డికిఎలాంటి ప్రాధాన్యత కల్పించినా అడిగేవారు వుండరు. సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముందు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమి కొని తెచ్చుకుంటే, కాంగ్రెస్, బిజేపిలు చేసే అసత్య ప్రచారాలు ఎంత భయంకరంగా వుంటాయో పార్టీ అదినేత ఆలోచించాలని పార్టీ నాయకులు కోరుతున్నారు. మూడు జిల్లాలకు చెందిన నాయకులందరితో సమావేశాలు నిర్వహించి, రాకేష్‌రెడ్డికి టికెట్ ఇవ్వడం వల్ల లాభ నష్టాలు బేరిజు వేసుకోండి. నాయకుల అభిప్రాయాలు తెలుసుకోండి. పార్టీలో అంతర్గతంగా బ్యాలెట్ పెట్టి సీక్రెట్‌గా అభిప్రాయం తెలుసుకునే ప్రయత్నం చేయండి. ఒక్క ఓటు కూడా రాకేష్‌రెడ్డికి పార్టీ నాయకులు వేయరు అనే అభిప్రాయాలే వినిపిస్తున్నాయి. బిఆర్ఎస్‌లో ఇంకా ఎంతోమంది విద్యావంతులున్నారు. పట్టభద్రులున్నారు. ఉద్యమకారులున్నారు. ఇంత కాలం ఎలాంటి పదవులు ఆశించని నాయకులున్నారు. ఈసారి మాత్రం అందరి అభిప్రాయాలతో కూడిన ఎంపిక చేపట్టండి. బిజేపిలో చెల్లని రాకేష్‌రెడ్డిని బిఆర్ఎస్ చెల్లించే ప్రయత్నం చేయడం వృదా ప్రయాస అంటున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు తప్పటడుగు వేయొద్దు.. .ఎమ్మెల్సీ ఎన్నికల ప్రభావం ఖచ్చితంగా వచ్చే ఎన్నికల్లో వుంటుందని మరువొద్దు!!!



22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

ఆదివారం 09-08-2026 పేజీలు : 08 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 122 రూ॥ 6.00





# బీజేపీలో విభేదాలకు తాత్కాలిక తెర!

## బండి, ఈటల మధ్య సయోధ్య కుదిర్చిన అధిష్టానం




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


- రాబోయే ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలని హెచ్చరిక
- ఫైర్ బ్రాండ్ బండిని ఫోకస్ చేసేందుకు బీజేపీ అధిష్టానం గట్టి వ్యూహం
- గత తప్పిదాన్ని గుర్తించి దిద్దుబాటు చర్యలు
- ఇందులో భాగమే బండి-ఈటల మధ్య సయోధ్య కుదర్చడం
- రేవంత్‌ను ఢీకొట్టగల నేత బండి సంజయ్
- ఇద్దరూ మాస్ లీడర్లే
- కేసీఆర్ బయటకు రాకపోవడం బీఆర్ఎస్‌కు మైనస్
- మాస్ లీడర్లు లేక బీఆర్ఎస్ సతమతం
- బండి రంగంలోకి దిగితే బీఆర్ఎస్‌కు పెద్ద దెబ్బ
- కాంగ్రెస్‌కు బీజేపీని ప్రత్యామ్నాయంగా మలచే శక్తి బండి సంజయ్‌దే
- బండి రంగంలోకి దిగితే రేవంత్‌కు టూ ఫ్రంట్ వార్ తప్పదు

### • కాంగ్రెస్‌లో అసమ్మతి రేవంత్‌కు తలనొప్పులు తెచ్చే అవకాశం • బండి ఎంట్రీతో రాష్ట్ర రాజకీయాల్లో పరుగులు మొదలు!

హైదరాబాద్, నేటిధాత్రి:
బీజేపీ అధిష్టానం చొరవతో బండి సంజయ్, ఈటల రాజేందర్ మరియు ఇతర నేతల మధ్య ఈ సయోధ్య (రాజీ) కుదరడంతో పార్టీని ఏకతాటిపై నడిపించేందుకు మార్గం సుగమమైంది. దీంతో తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలికి, రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేయడంపై నాయకులు దృష్టి పెట్టనున్నారు.
అంతేకాదు రాబోయే రోజుల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా, పార్టీలో ముఠా తగాదాలు లేకుండా అందరూ కలిసి పనిచేయాలనే బలమైన హెచ్చరికను అధిష్టానం ఈ విధంగా అమలు చేయించింది. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసి అధికారంలోకి రావాలని భావిస్తున్న జాతీయ నాయకత్వానికి, నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలు నష్టం చేకూరుస్తాయని స్పష్టమైంది. దీంతో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ , సీనియర్ నేత కె. లక్ష్మణ్ రంగంలోకి దిగి ఇద్దరు నేతల మధ్య రాజీ కుదిర్చారు. ఇటీవల ఢిల్లీలోని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ నివాసంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు, ముఖ్య నేతలకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.

4లో

## పెద్ది కుటుంబానికి కేసీఆర్ అండ

### ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి

### తల్లి అమృతమ్మకు రూ.25 లక్షలు.. మొత్తం రూ.2.25 కోట్ల సాయం



హైదరాబాద్, నేటిధాత్రి:
ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన స్వర్గీయ పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీ తరపున ఆ కుటుంబానికి రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.
పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించారు. వృద్ధాప్యంలో ఉన్న ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలను ఆమె పేరుతో బ్యాంకులో జమ చేయనున్నారు. మొత్తంగా రూ. 2.25 కోట్లను కుటుంబానికి అందించాలని పార్టీ నిర్ణయించింది.

**పిల్లల భవిష్యత్తుకు అండ**

పెద్ది సుదర్శన్‌రెడ్డి పిల్లల భవిష్యత్తు, వారి చదువు, కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం అండగా ఉంటుందని కేసీఆర్ తెలిపారు. ఈ అంశంపై పార్టీ సీనియర్లతో పాటు వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించినట్లు పేర్కొన్నారు.
దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమాలు పూర్తయిన అనంతరం జిల్లా పార్టీ ముఖ్య నేతలు సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించి తదుపరి నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. పెద్ది కుటుంబానికి ఎల్లవేళలా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.



- సరూర్‌నగర్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే
- రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీ మోసానికి నిదర్శనం
- 'నిరుద్యోగులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి'.. హరీశ్‌రావు

## నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష?

హైదరాబాద్, నేటిధాత్రి:
హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరూర్‌నగర్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు.

03లో

### నదీ జలాల హక్కులకు భంగం కలిగితే

## జల ఉద్యమం: కేటీఆర్

- తెలంగాణకు అన్యాయం చేస్తే మరో ఉద్యమం తప్పదు
- జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



హైదరాబాద్, నేటిధాత్రి:
నదీ జలాల విషయంలో కేంద్రం, రాష్ట్రం ఎవరు తెలంగాణకు నష్టం కలిగించేలా వ్యవహరించినా తిరుగుబాటు తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని తెలంగాణ నీటి వాటాల్లో అన్యాయం చేస్తే.. తెలంగాణ ఉద్యమాన్ని మించిన మరో ఆందోళన రాష్ట్రంలో వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే వారం జరగనున్న జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అంగీకరించిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ

03లో

## బోనాల వేళ.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

- లాల్‌దర్వాజా నుంచి చిలకలగూడ వరకు మళ్లింపులు
- భక్తుల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు.. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలి



హైదరాబాద్, నేటిధాత్రి:
బోనాల పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఆంక్షలు, మళ్లింపులు చేపట్టనున్నారు. లాల్‌దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి బోనాలు, కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాలు, అంబర్‌పేట మహంకాళి ఆలయం, చిలకలగూడ శ్రీ కట్ట మైసమ్మ-

03లో

## నకిలీ, ట్యాంపరింగ్ నంబర్ ప్లేట్లపై ఉక్కుపాదం

- చలానాల నుంచి తప్పించుకునేందుకు ఫేక్ ప్లేట్లు పెడితే కఠిన చర్యలు
- ఐదు క్రిమినల్ కేసులు నమోదు.. వాహనాలు స్వాధీనం



హైదరాబాద్, నేటిధాత్రి:
నకిలీ, ట్యాంపరింగ్ నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. ట్రాఫిక్ చలానాల నుంచి తప్పించుకునేందుకు నకిలీ నంబర్ ప్లేట్లు వినియోగిస్తున్న వాహనాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ సిటీ పోలీస్ ట్రాఫిక్ విభాగం జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ హెచ్చరించారు.

08లో

### బోనాల పండుగకు ఎంపీ

## వద్దిరాజు శుభాకాంక్షలు

- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు
- ప్రజలంతా భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలి



హైదరాబాద్,నేటిధాత్రి:
బోనాల పండుగ సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పాతబస్తీ, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆషాఢ మాసంలో గోల్కొండ శ్రీశ్రీశ్రీ జగదాంబిక అమ్మవారికి బోనం సమర్పించడంతో ప్రారంభమయ్యే బోనాల పండుగ.. ఆదివారం 9వ తేదీన పాతబస్తీ, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు

08లో

## నదీ జలాల హక్కులకు భంగం కలిగితే

# జల ఉద్యమం: కేటీఆర్



●తెలంగాణకు అన్యాయం చేస్తే మరో ఉద్యమం తప్పదు

●జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

హైదరాబాద్, నేటిధాత్రి:

నదీ జలాల విషయంలో కేంద్రం, రాష్ట్రం ఎవరు తెలంగాణకు నష్టం కలిగించేలా వ్యవహరించినా తిరుగుబాటు తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని తెలంగాణ నీటి వాటాల్లో అన్యాయం చేస్తే.. తెలంగాణ ఉద్యమాన్ని మించిన మరో ఆందోళన రాష్ట్రంలో వస్తుందని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లోని నందినగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే వారం జరగనున్న జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అంగీకరించిందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాలరాసేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమాధానం చెప్పాలని కోరారు.

### 'ఆదిత్యనాథ్ దాస్‌ను తొలగించాలి'

తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్‌ను సలహాదారుగా నియమించడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజినీర్ కూడా లేరా? అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లో తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు.

"చంద్రబాబు చెప్పుచేతల్లో రేవంత్‌రెడ్డి నడుస్తున్నారు. రేవంత్‌రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్‌ను వెంటనే తొలగించాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### మరోసారి నీళ్ల కోసం పోరాటం

నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి గురయ్యే పరిస్థితి ఏర్పడిందని కేటీఆర్ ఆరోపించారు. ఇదే జరిగితే బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుంటే జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు.

నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని బీఆర్ఎస్ హెచ్చరించిన తర్వాతే ప్రభుత్వం దిగివచ్చి పంపులను ఆన్ చేసిందని కేటీఆర్ తెలిపారు.

### 'ప్రధాన ప్రతిపక్షం ఒత్తిడి తెస్తేనే స్పందన'

పాలమూరు బిడ్డనని చెప్పుకునే రేవంత్‌రెడ్డికి పాలమూరు నీళ్ల ఇవ్వాలన్న సోయి లేదని కేటీఆర్ విమర్శించారు. వర్షాలు కురిసి పక్క రాష్ట్రం నీటిని ఎత్తిపోసుకుంటున్నా ముఖ్యమంత్రికి పట్టింపు లేదన్నారు. ప్రధాన ప్రతిపక్షం ముల్లు కట్టెతో పొడిస్తేనే ప్రభుత్వం స్పందిస్తోందని, లేదంటే నిద్రపోతున్నట్లు వ్యవహరిస్తోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ నదీ జలాల హక్కులను కాపాడేందుకు అవసరమైతే మరోసారి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష?



●సరూర్‌నగర్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే

●రెండు లక్షల ఉద్యోగాల భర్తీ హామీ మోసానికి నిదర్శనం

●'నిరుద్యోగులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి'.. హరీశ్‌రావు



హైదరాబాద్, నేటిధాత్రి:

హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరూర్‌నగర్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమేనని ఆరోపించారు. నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు."విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష?" అంటూ హరీశ్‌రావు ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్‌గా మారిందని మండిపడ్డారు.

### ఎన్నికల సమయంలో హామీలు.. ఇప్పుడు అవమానాలా?

అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారని, ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్లపైకి వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారని తెలిపారు. ఇది నిరుద్యోగుల తప్పా? ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన ప్రభుత్వ తప్పా? అని ప్రశ్నించారు.

### 'యథా రాజా.. తథా అధికారులు'

ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అంటూ అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరమన్నారు. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే.. ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్లు? అని నిలదీశారు.

### 'రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి ఉంటే..'

రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

"నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్" అంటూ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు.

### ఉన్నత విద్య చదివినా.. చిన్న ఉద్యోగాల కోసం పోటీ

ప్రభుత్వ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోందని హరీశ్‌రావు అన్నారు. నోటిఫికేషన్లు సక్రమంగా వెలువడకపోవడంతో పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.



భారీ ర్యాలీతో ఘన నివాళులు

## నల్లబెల్లిలో ఘనంగా ప్రజా వీరుడు

# పండుగ సాయన్న 186వ జయంతి వేడుకలు

●నల్లబెల్లిలో ఘనంగా ర్యాలీ.. మార్మోగిన 'జై సాయన్న' నినాదాలు

●ముదిరాజ్ సమాజ ఆత్మగౌరవానికి ప్రతీక పండుగ సాయన్న

●యువత ఐక్యతతో ముందుకు సాగాలని సంఘ నాయకుల పిలుపు

వర్ధన్నపేట, నేటిధాత్రి:

వర్ధన్నపేట: మండలంలోని నల్లబెల్లి గ్రామంలో ముదిరాజ్ ముద్దుబిడ్డ, ప్రజా వీరుడు, స్వాభిమాన యోధుడు పండుగ సాయన్న 186వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముదిరాజ్ కుల పెద్దలు, సంఘ నాయకులు, యువత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డప్పు వాయిద్యాలు, జెండాలతో గ్రామ ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించి 'జై సాయన్న' నినాదాలతో హోరెత్తించారు.

ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ పండుగ సాయన్న అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అని, ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం తరతరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. యువత ఆయన జీవిత చరిత్రను తెలుసుకుని ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముదిరాజ్ సమాజ అభివృద్ధి, విద్య, ఉపాధి, సామాజిక చైతన్యం కోసం ఐక్యంగా పనిచేయాలని సూచించారు. పండుగ సాయన్న చూపిన ధైర్యం, స్వాభిమానం, పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సమాజంలోని యువత విద్య, ఉద్యోగాలు, ఉపాధి రంగాల్లో రాణిస్తూ సమాజ అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు. గ్రామాల్లో సామాజిక ఐక్యతను పెంపొందించి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలవాలని సూచించారు.


కార్యక్రమంలో ముదిరాజ్ కుల పెద్దలు, సంఘ ప్రతినిధులు, యువ నాయకులు, మహిళలు, విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగ సాయన్నకు ఘన నివాళులర్పించారు. నల్లబెల్లి గ్రామంలో నిర్వహించిన 186వ జయంతి వేడుకలు ముదిరాజ్ సమాజ ఐక్యత, స్వాభిమానాన్ని చాటిచెబుతూ విజయవంతంగా ముగిశాయి.

# కాశీబుగ్గలో కొలువుదీరనున్న భారీ మహాశివుడు"


## కాశీబుగ్గ శివాలయం పక్కన త్వరలో భారీ మహాశివుని విగ్రహం

## మంత్రి కొండా సురేఖ సంకల్పం..









వరంగల్, నేటిధాత్రి:

కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వర ఆలయం పక్కన భారీ శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సంకల్పించినట్లు ఆలయ మాజీ ధర్మకర్త లక్కిరెడ్డి పూర్ణేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామల సునితకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్‌రాజ్ సూచనల మేరకు, మంత్రి కొండా సురేఖ ఎండార్స్ చేసిన వినతిపత్రాన్ని అందజేసినట్లు పూర్ణేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో దాసరి రాజేష్, కుడికాల కోటేశ్వర్, నీలం శ్రీనివాస్, మేడకుర్తి లోకేష్, పల్లకొండ రాజమణి పాల్గొన్నారు.

# గుంతల రోడ్డుపై లారీల జోరు

## ఏనుమాముల టూ దేశాయిపేట మార్గంలో వాహనదారుల అవస్థలు

●రోడ్డుపైనే లారీల నిలిపివేత.. పట్టించుకోని అధికారులు ●తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని స్థానికుల వేడుకోలు







వరంగల్, నేటిధాత్రి:

వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని వరంగల్ నగరాన్ని ఆనుకుని ఉన్న ఏనుమాముల మార్కెట్ నుంచి దేశాయిపేటకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రోడ్డంతా గుంతలు ఏర్పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు ప్రతిరోజూ భారీ లారీలను రోడ్డుపైనే నిలిపివేస్తుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోందని స్థానికులు వాపోతున్నారు.

### నడిరోడ్డుపైనే లారీల నిలిపివేత

ఏనుమాముల మార్కెట్ నుంచి దేశాయిపేట వైపు వెళ్లే మార్గంలో సరకు రవాణా చేసే లారీలను రోడ్డుపై ఇష్టారాజ్యంగా నిలుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. లోడ్ చేసిన లారీలను సైతం రహదారిపైనే నిలిపివేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పాదచారులు, మహిళలు రహదారిపై వెళ్లేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.

### కల్లాల్లో కట్టాల్సిన తాళ్లు.. రోడ్డుపైనే!

లారీలకు సంబంధించిన తాళ్లను, ఇతర సామగ్రిని కల్లాల్లో కట్టుకోవాల్సి ఉండగా.. నడిరోడ్డుపైనే కడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో రహదారిపైకి వచ్చే వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సి వస్తోంది. రాత్రివేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?

రోడ్డుపై గుంతలు.. మరోవైపు అడ్డంగా నిలిపిన లారీలు.. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే పరిస్థితి కాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లండి..

ఏనుమాముల–దేశాయిపేట మార్గంలో కనీసం తాత్కాలిక మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డుపై లారీలను నిలపకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

స్థానిక నాయకులు ఈ సమస్యను వర్ధన్నపేట ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత శాఖలతో మాట్లాడి తక్షణమే రహదారికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజల ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన ప్రజాప్రతినిధులు కనీసం ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న రహదారి సమస్యలపై దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బోనాల వేళ.. హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు



హైదరాబాద్, నేటిధాత్రి:

బోనాల పండుగ నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఆంక్షలు, మళ్లింపులు చేపట్టనున్నారు. లాల్‌దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి బోనాలు, కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాలు, అంబర్‌పేట మహంకాళి ఆలయం, చిలకలగూడ శ్రీ కట్ట మైసమ్మ–పోచమ్మ ఆలయాల వద్ద భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళిక రూపొందించారు. నిర్దేశిత సమయాల్లో వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించడంతో పాటు భక్తుల కోసం ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలు కల్పించారు.

### లాల్‌దర్వాజాలో రెండు రోజుల ఆంక్షలు

సింహవాహిని శ్రీ మహంకాళి లాల్‌దర్వాజా బోనాలు, ఊరేగింపు సందర్భంగా ఆగస్టు 9న ఉదయం 6 గంటల నుంచి ఊరేగింపు ముగిసే వరకు, ఆగస్టు 10న ఉదయం 9 గంటల నుంచి ఊరేగింపు పూర్తయ్యే వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి.

ఇంజిన్‌బౌలి, ఫలక్‌నుమా, మహబూబ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వైపు నుంచి ఆలియాబాద్ వైపు వచ్చే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తారు. నాగుల్‌చింత, సుధా టాకీస్, గౌలీపురా, రాజన్నబౌలి, కందికల్‌గేట్, బాలాగంజ్ తదితర ప్రాంతాల నుంచి లాల్‌దర్వాజా వైపు వచ్చే వాహనాలకూ మళ్లింపులు ఉంటాయి.

ఛత్రినాక, ఉప్పుగూడ, చంద్రాయణగుట్ట, ఫతేదర్వాజా, మొఘల్‌పురా, మీర్‌చౌక్, యాకుత్‌పురా, పురానీహవేలీ నుంచి చార్మినార్, లాల్‌దర్వాజా వైపు వెళ్లే వాహనాలను వివిధ ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించనున్నారు.

మదీనా ఎక్స్‌రోడ్స్ నుంచి ఇంజిన్‌బౌలి వరకు గుల్జార్‌హౌస్, చార్మినార్, చార్మినార్ బస్ టెర్మినల్, హిమ్మత్‌పురా, నాగుల్‌చింత, ఆలియాబాద్ మీదుగా వెళ్లే ప్రధాన రహదారిని ఊరేగింపు పూర్తయ్యే వరకు అన్ని రకాల వాహనాల రాకపోకలకు మూసివేస్తారు.

చాదర్‌ఘాట్, నూర్‌ఖాన్ బజార్, ఎస్‌జే రోటరీ, శివాజీ బ్రిడ్జి నుంచి సాలార్‌జంగ్ మ్యూజియం వైపు వెళ్లే వాహనాలను కూడా ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తారు. ఖిల్వత్, మూసాబౌలి నుంచి లాడ్‌బజార్ వైపు వెళ్లే వాహనాలకూ మళ్లింపులు ఉంటాయి.

### భక్తులకు పార్కింగ్ సౌకర్యం

ఆలియాబాద్ వైపు నుంచి వచ్చే భక్తులు శాలిబండ పోస్టాఫీసు ఎదురుగా దేవి ప్లైవుడ్ ప్రధాన రహదారిపై వరుసలో లేదా అల్కా థియేటర్ ఖాళీ స్థలంలో వాహనాలు నిలపాలి.

హరిబౌలి, గౌలీపురా వైపు నుంచి వచ్చే వారికి ఆర్యవైశ్య మందిరం, అల్కా థియేటర్ ఖాళీ స్థలం, వీడీపీ పాఠశాల మైదానం, మిత్రా స్పోర్ట్స్ క్లబ్‌లో పార్కింగ్ సౌకర్యం కల్పించారు.

ఛత్రినాక వైపు నుంచి వచ్చే భక్తులకు లక్ష్మీనగర్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం, పత్తర్‌కీ దర్గా సమీపంలోని ఫూల్‌బాగ్ చమన్ మైదానంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. మూసాబౌలి, మీర్‌చౌక్ వైపు నుంచి వచ్చే వారు చార్మినార్ బస్ టెర్మినల్‌లో వాహనాలు నిలపాలి. ఊరేగింపు వాహనాలకు ఢిల్లీగేట్ వద్ద వరుస పార్కింగ్ ఉంటుంది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ బస్సులను చార్మినార్, ఫలక్‌నుమా, నయాపూల్ వైపు అనుమతించరు. వాటిని పాత సీబీఎస్, అఫ్జల్‌గంజ్, దారుల్‌షిఫా ఎక్స్‌రోడ్డు, ఛత్రినాక, ఇంజిన్‌బౌలి వద్ద నిలిపి ప్రత్యామ్నాయ మార్గాల్లో నడుపుతారు.

### కార్వాన్‌లో ముందుగానే మళ్లింపులు

దర్బార్ మైసమ్మ బోనాలు, ఏనుగు ఊరేగింపు నేపథ్యంలో కార్వాన్‌లో ఆగస్టు 8 రాత్రి 9 గంటల నుంచే ట్రాఫిక్ మళ్లింపులు ప్రారంభమవుతాయి. ఆగస్టు 10 ఉదయం వరకు కొనసాగుతాయి.

పురానాపూల్ జంక్షన్, టప్పాచబుత్రా టీ జంక్షన్, యాదవ్‌భవన్, ముర్గిచౌక్, తల్లాగడ్డ జంక్షన్, మొఘల్‌కానాలా తదితర ప్రాంతాల నుంచి దర్బార్ మైసమ్మ ఆలయం వైపు వచ్చే వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లిస్తారు. ఏనుగు ఊరేగింపు కదలికను బట్టి మరిన్ని మళ్లింపులు చేపడతారు.

భక్తుల కోసం కార్వాన్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల మైదానం, తోలిమసీదు ఎదురుగా ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం, జగత్‌సింగ్ ప్రైవేటు స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేశారు. జగత్‌సింగ్ స్థలాన్ని ద్విచక్ర వాహనాల కోసం వినియోగించుకోవచ్చు.

### అంబర్‌పేటలో ఫ్లైఓవర్ మీదుగా..

మహంకాళి ఆలయం, అంబర్‌పేట వద్ద ఆగస్టు 9 ఉదయం 6 గంటల నుంచి ఆగస్టు 10 మధ్యాహ్నం 12 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయి.

ఉప్పల్ నుంచి చాదర్‌ఘాట్, ఎంజీబీఎస్ వైపు వెళ్లే జిల్లా, నగర బస్సులు, డీసీఎంలు, భారీ వాహనాలు సహా అన్ని వాహనాలను అంబర్‌పేట ఫ్లైఓవర్ మీదుగా పంపిస్తారు. చాదర్‌ఘాట్, ఎంజీబీఎస్ నుంచి వచ్చే వాహనాలకూ ఇదే మార్గాన్ని వినియోగించనున్నారు.

రామంతాపూర్ వైపు నుంచి ఆలయానికి వచ్చే భక్తులు అంబర్‌పేట ఫ్లైఓవర్ వద్ద ఎడమ బైలేన్ ద్వారా గాంధీ విగ్రహం వైపు వెళ్లి అంబర్‌పేట జీహెచ్ఎంసీ మైదానంలో వాహనాలు పార్క్ చేసుకోవాలి.

ట్రాఫిక్ రద్దీ పెరిగితే ఉప్పల్ నుంచి అంబర్‌పేట టీ జంక్షన్, ఆలీకేఫ్ వైపు వచ్చే వాహనాలను రాయల్ జ్యూస్ కార్నర్, మల్లికార్జున్‌నగర్, డీడీ కాలనీ, సిండికేట్ బ్యాంక్, శివంరోడ్డు, తిలక్‌నగర్ మీదుగా మళ్లిస్తారు. సల్దానాగేట్ వద్ద రద్దీ ఉంటే ఆలీకేఫ్ నుంచి హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ–నాగోల్ రోడ్డు వైపు వాహనాలను మళ్లిస్తారు.

### చిలకలగూడలో ఉదయం 5 నుంచి రాత్రి 11 వరకు

శ్రీ కట్ట మైసమ్మ–పోచమ్మ ఆలయం, చిలకలగూడ వద్ద ఆగస్టు 9, 10 తేదీల్లో ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయి. సీతాఫల్‌మండి జంక్షన్ నుంచి చిలకలగూడ ఎక్స్‌రోడ్డు వైపు వచ్చే వాహనాలను నామాలగుండు, వారసిగూడ ఎక్స్‌రోడ్డు, సీతాఫల్‌మండి టీ జంక్షన్, ఓయూ సిటీ రోడ్డు, తార్నాక ఎక్స్‌రోడ్డు వైపు మళ్లిస్తారు. అల్లుగడ్డబావి, సికింద్రాబాద్ నుంచి చిలకలగూడ ఎక్స్‌రోడ్డు మీదుగా సీతాఫల్‌మండి వైపు వెళ్లే వాహనాలను పద్మారావునగర్ టీ జంక్షన్ వైపు మళ్లించనున్నారు.

### ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలి

బోనాల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో భారీగా భక్తుల రద్దీ ఉండే అవకాశం ఉన్నందున వాహనదారులు ముందుగానే తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. వీలైనంత వరకు పండుగ ప్రాంతాలకు దూరంగా ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని కోరారు. అత్యవసర ట్రాఫిక్ సహాయం కోసం 9010203626 నంబరును సంప్రదించవచ్చని తెలిపారు. తాజా ట్రాఫిక్ మళ్లింపులు, మార్గాల వివరాలను హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల ద్వారా తెలుసుకోవచ్చని వెల్లడించారు.




# బీజేపీలో విభేదాలకు తాత్కాలిక తెర!

## బండి, ఈటల మధ్య సయోధ్య కుదిర్చిన అధిష్టానం



చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

**హైదరాబాద్, నేటిధాత్రి:**
బీజేపీ అధిష్టానం చొరవతో బండి సంజయ్, ఈటల రాజేందర్ మరియు ఇతర నేతల మధ్య ఈ సయోధ్య (రాజీ) కుదరడంతో పార్టీని ఏకతాటిపై నడిపించేందుకు మార్గం సుగమమైంది. దీంతో తెలంగాణ బీజేపీలో అంతర్గత విభేదాలకు స్వస్తి పలికి, రాబోయే ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కృషి చేయడంపై నాయకులు దృష్టి పెట్టనున్నారు.

అంతేకాదు రాబోయే రోజుల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరిని నియమించినా, పార్టీలో ముఠా తగాదాలు లేకుండా అందరూ కలిసి పనిచేయాలనే బలమైన హెచ్చరికను అధిష్టానం ఈ విధంగా అమలు చేయించింది. తెలంగాణలో పార్టీని బలోపేతం చేసి అధికారంలోకి రావాలని భావిస్తున్న జాతీయ నాయత్వానికి, నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలు నష్టం చేకూరుస్తాయని స్పష్టమైంది. దీంతో బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ , సీనియర్ నేత కె. లక్ష్మణ్ రంగంలోకి దిగి ఇద్దరు నేతల మధ్య రాజీ కుదిర్చారు. ఇటీవల ఢిల్లీలోని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ నివాసంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు, ముఖ్య నేతలకు ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. తెలంగాణ బీజేపీ ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, సీనియర్ నేత కె. లక్ష్మణ్ ఆధ్వర్యంలో నేతల మధ్య గంటన్నర పాటు సుదీర్ఘ చర్చలు జరిగాయి.నేతల మధ్య వ్యక్తిగత విభేదాలు, అహంకారాలు పక్కన పెట్టి కలిసి పనిచేయాలని హైకమాండ్ గట్టిగా ఆదేశించింది.మల్కాజిగిరి, కరీంనగర్‌వంటి కీలక ప్రాంతాల్లో జిల్లా అధ్యక్షుల ఎంపికపై ఇద్దరు నేతల మధ్య ఉన్న వివాదాలను అధి ష్టానం ఒక ఫార్ములా ప్రకారం పరిష్కరించింది. ఇద్దరు నేతల అనుచరులకు కమిటీల్లో సముచితస్థానం కల్పించడంతో ఈ ప్రతిష్టంభన తొలగిపోయింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ఎదుర్కొని తెలంగాణలో బీజేపీని ప్రత్యామ్నాయ శక్తిగా మార్చడానికి సీనియర్లు, కొత్తగా చేరిన నేతలు కలిసి నడవాలని నిర్ణయించుకున్నారు. బండి సంజయ్ తన నివాసంలో ఈటల రాజేందర్, కిషన్ రెడ్డి, డి.కె. అరుణ వంటి అగ్రనేతలను ఆహ్వానించి సన్మానించడం ద్వారా "బీజేపీ అంతా ఒకే కుటుంబం" అనే బలమైన సంకేతాన్ని క్యాడర్‌లోకి పంపడమే దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. కరీంనగర్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల అధ్యక్షుల నియామకాలు ఇద్దరి మధ్య ఈగోల వల్ల చాలా కాలంగా నిలిచిపోయాయి. ఈ విందు రాజకీయాల తర్వాతే ఆ మూడు జిల్లాలకు కొత్త అధ్యక్షులను ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ప్రకటించారు. నేతల మధ్య తాత్కాలికసయోధ్య కుదిరినా క్షేత్రస్థాయిలో కరీంనగర్, మల్కాజిగిరి వంటి నియోజకవర్గాల్లో ఇరు వర్గాల (క్యాడర్) మధ్య ఉన్న ఆధిపత్య పోరు రాత్రికి రాత్రే ముగిసిపోతుందనుకుంటే అంతకంటే అమాయకత్వం మరోటుండదు. ఏది ఏమైనా ఎన్నికల సమయం దగ్గరపడుతున్న తరుణంలో, ఇన్నా ళ్లూ ప్రత్యర్థులుగా ముద్రపడిన బండి, ఈటల ఒక్కటవ్వడం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని, పాజిటివ్ చర్చను తీసుకొచ్చింది. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత కూర్పునకు, జిల్లాల అధ్యక్షుల నియా మకాలకు ఈ సయోధ్య మార్గం సుగమం చేసింది.

### మాస్ లీడర్ గుర్తింపునకు బండి ప్రయత్నం

బండి సంజయ్ గతంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 'ప్రజా సంగ్రామ యాత్ర' ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి బలమైన క్రేజ్ సంపాదించారు. ప్రస్తుతం కేంద్ర సహాయ మంత్రిగా ఉన్నప్పటికీ, తెలంగాణ బీజేపీలో తానే "మాస్ లీడర్" అని నిరూపించుకోవడానికి ఆయన ప్రయ త్నిస్తున్నారు. ఢిల్లీ వేదికగా తెలంగాణ నేతలను పిలిచి విందులు ఇవ్వడం, సన్మానాలు చేయడం ద్వారా భవిష్యత్తులో తెలంగాణ బీజేపీకి తానే ప్రధాన శక్తి అన్న సంకేతాన్ని అధిష్టానానికి మరి యు క్యాడర్‌కు ఇస్తున్నారు. తాను అధ్యక్ష రేసులో లేనని క్లారిటీ ఇచ్చినప్పటికీ, పార్టీలో తన ప్రాధాన్యత తగ్గకుండా చూసుకోవడమే దీని వెనుక వ్యూహం. బండి సంజయ్‌కు క్రేజ్ వున్న సంగతితెలుసు కునుకనే అధిష్టానం అందరినీ కలుపుకుపోయే బాధ్యతను అప్పగించి, ఆయన ద్వారానే ఈ సయోధ్య విందులను ఏర్పాటు చేయించింది.

### సవాలుగా మారిన గ్రూపు తగాదాల కట్టడి

